సంక్షేమ పాలనకు మరోసారి పట్టం



పిచ్చాటూరు: అదవికొడియంబేడులో సర్పంచ్‌గా గెలుపొందిన కిరణ్‌కుమార్‌ను గజమాలతో అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



గోవర్ధనగిరిలో వార్డు సభ్యుడిగా గెలుపొందిన బాలసుబ్రమణ్యం రాజును గజమాలతో అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- ఏకే బేడు సర్పంచ్‌గా కిరణ్ కుమార్ ఘన విజయం
- వార్డు మెంబరు స్థానం కూడా వైఎస్సార్ సీపీ మద్దతుదారుదే
- కుట్ర రాజకీయాలను తిప్పికొట్టిన జనం

పిచ్చాటూరు: సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఘన విజయం సాధించారు. జిల్లాలో పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థి కె.కిరణ్ కుమార్ 40 ఓట్లతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు ప్రకటించారు. మొత్తం 1033 ఓట్లు ఉండగా అందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కిరణ్‌కుమార్‌కు 411, టీడీపీ మద్దతుదారు ఎంఎస్ రవికి 371, చెల్లని ఓట్లు 11, నోటాకు 12 ఓట్లు పడ్డాయన్నారు. అదేవిధంగా గోవర్ధనగిరి గ్రామంలో 7వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు బాలసుబ్రమణ్యం రాజు 11 ఓట్లతో గెలుపొందినట్లు ఆయన తెలిపారు. ఈ వార్డులో మొత్తం 114 ఓట్లు ఉండగా ఇందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు బాలసుబ్రమణ్యం రాజుకు 57, టీడీపీ మద్దతుదారుడికి 46 ఓట్లు, ఒక ఓటు నోటాకు పడ్డాయన్నారు.

కుట్ర రాజకీయాలను తిప్పికొట్టారు: ఎమ్మెల్యే ఆదిమూలం

ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఎమ్మెల్యే ఆదిమూలం మీడియాతో మాట్లాడారు. గోవర్ధనగిరి, అడవికొడియం బేడు పంచాయతీలకు వెళ్లిన ఆయన గెలుపొందిన అభ్యర్థులను గజమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు పంచాయతీలు కూడా టీడీపీకి అనుకూలమని, ఇందులో గోవర్ధనగిరి వార్డుమెంబరు స్థానం టీడీపీ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు సొంత పంచాయతీలో ఉందన్నారు. గతంలో ఇక్కడ వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన వారు మరణించడంతో ఉపఎన్నికలు వచ్చాయన్నారు. ఏకగ్రీవం కావాల్సిన ఈ రెండు స్థానాల్లో కావాలనే టీడీపీ మద్దతు ఇచ్చి అభ్యర్థులను పోటీలో నిలిపిందన్నారు. డబ్బు, కులాల మధ్య చిచ్చుపెట్టి టీడీపీ నేతలు గెలిపించడానికి ప్రయత్నించారన్నారు. టీడీపీ కుట్రలను పసిగట్టిన ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పారని తెలిపారు. సీఎం జగనన్న సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు మరోమారు పట్టం కట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులకు, అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక పూజలు



ఆలయంలో హోమ పూజలు చేస్తున్న అర్చకులు

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి పంచాయతీ పరిధి దుర్గిపేరి గ్రామంలో నూతన విజయ గణపతి ఆలయంలో రెండో రోజైన శనివారం కుంబాభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గణపతి, లక్ష్మీ హోమం, గోపూజ, నూతన విగ్రహానికి క్షీరాభిషేకం, గోపుర శిఖర కలశ ప్రతిష్టాపనం, కుంభా అలంకరణ నిర్వహించారు. ఆదివారం నూతన విజయ గణపతి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు.

ఆర్‌ఐకు డీటీగా పదోన్నతి



వెంకటసుబ్బయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్యకు డిప్యూటీ తహసీల్దారుగా పదోన్నతి లభించింది. శనివారం జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి పదోన్నతి ఉత్తర్వులు అందాయి. డిప్యూటీ తహసీల్దారుగా పదోన్నతి పొందడంపై మాసారపు వెంకటసుబ్బయ్య సంతోషం వ్యక్తం చేయగా, ఆయనకు తహసీల్దారు భార్గవి, డీటీ శివయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, వీఆర్‌ఓలు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మార్సీలో తనిఖీలు



ఆన్‌లైన్ నమోదుపై ఆరా తీస్తున్న ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ శ్రీధర్

సత్యవేడు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీని ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, సీఎంఓ సురేష్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేవీకే కిట్లు, డ్రాప్‌అవుట్లు, విద్యార్థుల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. జేవీకే కిట్లు అందరికీ అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులచే 100 శాతం బయోమెట్రిక్ చేయించాలన్నారు. అంతకుముందు దాసుకుప్పం ఉన్నత పాఠశాల గదుల్లో అమర్చిన ఐఎఫ్‌పీ ప్యానళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 ఉషా, ఎంఐఎస్ కోర్డినేటర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా బోధన చేయండి



విద్యార్థుల నోట్ పుస్తకాలలోని తప్పులను సరిచేస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: తరగతి గదిలో విద్యార్థులకు సృజనాత్మకంగా టబోధన చేస్తూ, అన్ని సబ్జెక్టులపై మక్కువ, అభిరుచి కలిగేలా చూడాలని ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని ఆలత్తూరు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేసి వారిలో ఉన్న అంతర్గత సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీయాలన్నారు. విద్యార్థుల హోమ్‌వర్క్ నోట్స్ పరిశీలించి, తప్పులను సరిదిద్దాలని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భిణులు క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేసుకోవాలని, ప్రభుత్వాస్పత్రిలో వారికి అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తున్నామని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ ప్రభుత్వాస్పత్రిలో శనివారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటే రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యల గురించి తెలుస్తుందన్నారు. గర్భిణులు డాక్టర్లు ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడితే కడుపులో బిడ్డ క్షేమంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో ఇచ్చే మాత్రలను క్రమం తప్పకుండా, తప్పనిసరిగా వాడాలన్నారు. గర్భిణులకు పలుసూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథరెడ్డికి ఘన నివాళి



రఘునాథరెడ్డికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వర్తిస్తున్న శానటరీ ఇన్‌స్పెక్టర్ రఘునాథరెడ్డికి పలువురు అధికారులు, సిబ్బంది శనివారం నివాళులర్పించారు. రాజంపేట సమీపంలో శుక్రవారం రఘునాథరెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొని ఆయన అక్కడికక్కడే మరణించారు. పరిపాలన భవనంలో ఆయన చిత్రపటం ఉంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు గుర్తింపు కార్డులు



ఏర్పేడు: స్థానిక సచివాలయ పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లకు శనివారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య గుర్తింపు కార్డులు అందజేశారు. ఏర్పేడు సచివాలయ పరిధిలో 14 మంది గ్రీన్ అంబాసిడర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. విధులకు హాజరయ్యేటప్పుడు విధిగా గుర్తింపు కార్డులను ధరించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, నాగూర్ రాజ్, ఏఎన్ఎం రీటా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం



తాగునీటి ట్యాంకు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: మండలంలోని తిరువట్యం దళితవాడలో రూ.3.6 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు, ట్యాంకును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీని ఆయన నెరవేర్చారు. తిరువట్యం గ్రామ పంచాయతీ ప్రజలు గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆదిమూలంకు తాగునీటి అవస్థలను విన్నవించారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీ సమీపంలో బోరు తవ్వించి, దళితవాడ వరకు పైపులైన్, ట్యాంక్ ఏర్పాటు చేయించారు. శనివారం వీటిని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించడంతో స్థానిక గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి సచివాలయంలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హేమమ్మ, సర్పంచ్ నాగూరు, పార్టీ కన్వీనర్ సొరకాయలు, తహసీల్దార్ ప్రమీల, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

నారాయణవనం: మండల కేంద్రం నారాయణవనంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తిరుపతి సాయిసుధ ఆస్పత్రి నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కోలా ఆనంద్‌కు ఘన సన్మానం



కోలా ఆనంద్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కోలా ఆనంద్‌ను ఆ పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన స్వగృహంలో కలిసి దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ కోలా ఆనంద్‌కు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండేటి గోపాల్, కోనేటి అయ్యప్ప, ఢిల్లీకుమార్ సుబ్రహ్మణ్యం, గోపాల్, చెంగలారాయల్ రెడ్డి, హరీష్, మోహన్‌రావు, అమరనాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సన్మానం



టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డిని సన్మానిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. నూతనంగా తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కరుణాకరరెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి శ్రీకాళహస్తీశ్వరాలయ వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యులు మున్నా రాయల్, రమాప్రభ, పసల సుమతి, ప్రత్యేక ఆహ్వానితులు పాలమంగళం నీలా, ప్రముఖులు నంద, భాస్కర్‌ముదిరాజ్, రవి, రమణయ్యనాయుడు, గోపిగౌడ్, వెంకటసుబ్బయ్య, లక్ష్మీపతి, బాలగౌడ్, సుధీర్, సాయి, వంశీ, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణకు రక్షణ



మొక్కను నాటుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రతిమ

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు అరణిప్రతిమ తెలిపారు. శనివారం ఆమె బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటి కాపాడాలని సూచించారు. చెట్లు లేకపోవడం వల్లే వర్షాలు పడడం లేదని, ఎండవేడిమి ఎక్కువ అవుతోందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెట్లను పెంచడం వల్ల పచ్చదనంతో పాటు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ నరసింహారావు, హెచ్ఎం రమణయ్య, ఉపసర్పంచ్ మునిరాజా, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సేవ్ ది చిల్డ్రన్స్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ హేమంత్



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కిరణ్‌కుమారి

వరదయ్యపాళెం: ప్రతి విద్యార్థి వ్యాధులపై అవగాహన పెంచుకుని ఆ దిశగా ఆహారపు అలవాట్లు, వ్యాయామంపై దృష్టి సారించాలని సేవ్ ది చిల్డ్రన్స్ మోండలెజ్ బాల్‌రక్షా భారత్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ హేమంత్ తెలిపారు. వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు పోషకాహారం ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్, పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్య అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల విద్యార్థినులకు సంస్థ సూపర్‌వైజర్ కిరణ్ కుమారి రుతుక్రమ పరిశుభ్రత, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, స్వీయ పరీక్షా విధానాలు, చికిత్స గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కళాశాలకు మట్టి తరలింపు



కళాశాల ఆవరణలో డంప్ చేసిన మట్టి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో గ్రావెల్ ఏర్పాటు చేశారు. ఆవరణ లోతట్టుగా ఉండడంతో వర్షాకాలం మురుగునీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు సర్పంచ్ తమ సొంత ఖర్చుతో 50 ట్రిప్పుల గ్రావెల్‌ను ఆవరణలో తోలి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు కరుణాకరన్, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఫుడ్‌ఫెస్ట్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లయిడ్ మైక్రోబయాలజీ, ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో శనివారం ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించారు. వర్సిటీ డీన్‌లు, అధ్యాపకులు హాజరై విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహార భద్రత, నాణ్యత ప్రధానాంశాలుగా ప్రోబయోటిక్స్ ప్రభావం, బ్యాక్టీరియా ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యాపకులు తెలిపారు.

ఖాళీ జాగా కనిపిస్తే కబ్జానే..!



గోపాలరావుకాలనీలో స్థలాన్ని ఆక్రమించి మట్టి తోలిన అక్రమార్కులు

వరదయ్యపాళెం: మేజర్ పంచాయతీ వరదయ్యపాళెంలోని గోపాలరావుకాలనీ అక్రమార్కులకు అడ్డాగా మారింది. ఖాళీ జాగా కనిపిస్తే ఎంచక్కా కబ్జా చేస్తూ ఆ స్థలం తమదేనంటూ వితండవాదం చేస్తున్నారు. అసలైన లబ్ధిదారులు అడిగితే వారిపైనే అక్రమార్కులు తిరగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2011లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతరులకు చెందిన పేదలకు 350 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఆ ప్రాంతంలో ఆర్థిక స్తోమత ఉన్నవారు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు కొంతమంది ఇళ్ల నిర్మాణం చేసుకోకపోవడంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు ఖాళీ స్థలాలు కనిపిస్తే రాత్రికి రాత్రే మట్టి తోలేస్తున్నారు. వెంటనే చదును చేస్తున్నారు. ఆ స్థలాలు తమవేనంటూ అటకాయిస్తున్నారు. దీనిపై పలుమార్లు మండల రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. దీనిపై తహసీల్దార్ గౌరిశంకరరావును వివరణ కోరగా విచారణ చేపట్టి అసలైన లబ్ధిదారుల వివరాలను గుర్తించి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పురుగుమందుల వాడకంపై అవగాహన



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి సమీపంలో ఉన్న రైతులు, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు, సొసైటీ సిబ్బందికి పురుగుమందుల వాడకంపై అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తి మండల కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమానికి న్యూఢిల్లీకి చెందిన ఇఫ్కోసంస్థ జీఎం డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు నానో యూరియా, డీఏపీల వాడకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంయుక్త వ్యవసాయ సంచాలకులు రమేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఇఫ్కో అధికారి దిలీప్‌కుమార్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

విజయగణపతి ఆలయానికి విరాళాల వెల్లువ



విరాళం అందజేస్తున్న జమళ్ల శ్రీనివాసులు



నగదు అందజేస్తున్న పత్రా సిద్దయ్య



నగదును అందజేస్తున్న మునిరామిరెడ్డి

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి పంచాయతీ పరిధి దుర్గిపేరిలో నూతనంగా నిర్మించిన విజయ గణపతి ఆలయానికి శనివారం నగదు విరాళాలు అందజేశారు. ప్రస్తుతం ఆలయంలో కుంభాభిషేక పూజలు జరుగుతున్నాయి. మండలంలోని బాలకృష్ణాపురానికి చెందిన వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు రూ.50 వేలు నగదు, నచ్చనేరికి చెందిన పత్రా సిద్దయ్య రూ.10,116, నాగంపల్లెకు చెందిన మునిరామిరెడ్డి రూ.10,216 నగదును కమిటీ సభ్యులకు విరాళంగా అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సంపత్ నవీన్ కుమార్ యాదవ్, కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, మోహన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో మొక్కల పెంపకంపై అవగాహన



మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి మధురెడ్డి, (ఇన్‌సెట్) క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థికి బహుమతి అందిస్తున్న శ్రీసిటీ అధికారులు

సత్యవేడు: శ్రీసిటీ ఫౌండేషన్, శ్రీసిటీ–శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఇరుగుళం, మాదనపాళెం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మొక్కల పెంపకంపై శ్రీసిటీ ఉద్యానవన అధికారి మధురెడ్డి అవగాహన కల్పించారు. శనివారం ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మొక్కల రకాలు, వాటి లక్షణాలు, పెంపకం, సంరక్షణ, ఉపయోగాలపై ఆయన వివరించారు. ప్రకృతి, పచ్చదనంపై క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. శ్రీసిటీఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యానవనాలు, పరిశ్రమల ప్రదర్శనలకు అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ఉపాధ్యాయులు , విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీసిటీ యాజమాన్యం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మాండలెజ్ కంపెనీతో తయారైన చాక్లెట్స్ గిఫ్ట్ బాక్సులను అందించారు. కార్యక్రమంలో శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రనాథ్, కుమార్, పల్లేటి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.